www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 26 సెప్టెంబర్ 2025

5

తిరుపతి



భువనేశ్వరి ట్రేడ్‌ఫెయిర్ ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుపతి డిబిఆర్ రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన భువనేశ్వరి ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను తుడా చైర్మన్, టీటీడీ బోర్డు సభ్యులు డాలర్స్ దివాకర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు..ఈ సందర్భంగా నిర్వాహకులు ఏర్పాటు చేసిన అయోధ్య రామమందిర నమూనా ఆలయాన్ని అందులోని బాల రామున్ని సందర్శించారు. అనంతరం తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. 200 మంది కళాకారులు నెలరోజుల పాటు శ్రమించి అయోధ్యలో నిర్మించిన రామ మందిర నమూనా ఆలయాన్ని ఇక్కడ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ నమూనా ఆలయాన్ని తిరుపతి జిల్లా ప్రజలు విచ్చేసి దర్శించాలని కోరారు. పిల్లలు పెద్దలు సాయంత్రం వేళ ఆటవిడుపుగా ఎగ్జిబిషన్ కి వచ్చి తిలకించాలని కోరారు.

13 గంటల పనికి 'కూటమి' సై

కార్మికులకు రక్షణ కరువు

ఫ్యాక్టరీల్లో 'ఉపాధి భద్రత' ఏది..?

ప్రజాశక్తి - ఏర్పేడు

కార్పొరేట్ సంస్థల నిరంకుశ వైఖరితో కార్మికుడే బలిపశువు..కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించకపోగా ఫ్యాక్టరీల్లో 13 గంటల పని విధానాన్ని తీసుకొస్తూ క్యాబినెట్‌లో కూటమి ప్రభుత్వం 'సై' అంది. పాలకులు కార్పొరేట్‌కు దాసోహం కావడంతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు నిర్వీర్యమైపోతున్నాయి. కార్మికులు 13 గంటలు పని చేయాలని శాసిస్తున్న పాలకులు, వారికి ఉద్యోగ భద్రత కల్పించడంలో మాత్రం ఏమాత్రం చొరవ చూపడం లేదు. వింగ్‌టెక్ పరిశ్రమలో ఉపాధి కోల్పోయిన 242 మంది కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినా ఇంతవరకూ అతీగతీ లేకపోవడం గమనార్హం. కార్మికశాఖ సైతం నిమ్మకు నీరెత్తినట్లు ఉండడంతో అర్ధాంతరంగా ఉపాధి పోయి కార్మికుల జీవితాలు వీధిన పడుతున్నాయి.

కార్మికులకు రక్షణ కరువు

గూడూరు కలర్షిన్ పరిశ్రమలో జింక్ ద్రావణం తొట్టెలో పడి ఉత్తరప్రదేశ్‌కు చెందిన 25 ఏళ్ల ఆదిత్య మృతిచెందాడు. ఏర్పేడు మండలం మేర్లపాక సమీపంలోనూ పుష్పిత్ స్టీలు కంపెనీలో వెల్డింగ్ చేస్తూ పైనుంచి పడి బీహార్ కార్మికుడు మృతిచెందాడు. అలాగే శ్రీకాళహస్తి మండలం ఈసీఎల్ కర్మాగారంలో ఓ కార్మికుడు, పెళ్లకూరు అగర్వాల్ పరిశ్రమలో నలుగురు కార్మికులు, టివిఎస్ పరిశ్రమలో ఒకరు, హిందూస్థాన్ పరిశ్రమలో ఓ మహిళ మృత్యువాత పడ్డారు. ఇవి వెలుగులోకి వచ్చిన కొన్ని ఘటనలు మాత్రమే. వెలుగులోకి రానివి మరెన్నో.. కార్మికశాఖ, లేబర్ అధికారుల పర్యవేక్షణ లేమి కారణంగా పరిశ్రమల్లో వరుస అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్న దుస్థితి. ఇటీవల ఫాక్స్‌లింక్స్ కంపెనీ బస్సు ప్రమాద ఘటనలోనూ పదుల సంఖ్యలో కార్మికులు గాయాలపాలయ్యారు. ఇటీవల ఎనిమిది గంటల పని విధానంలోనే మేర్లపాక పుష్పిత్ స్టీలు పరిశ్రమలో పనిచేస్తున్న మహేష్ అనే యువకుడు మెకానిక్‌గా పనిచేస్తూ సొమ్మసిల్లి పడిపోయి మృతిచెందాడు.

వేతనాల సమస్యపై రోడ్డెక్కిన కార్మికులు (ఫైల్)

మార్కెటింగ్ లేదనే సాకుతో 'వింగ్‌టెక్'

మార్కెటింగ్ లేదనే సాకుతో ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ.60 కోట్ల జిఎస్టి చెల్లించకపోగా వింగ్ టెక్ పరిశ్రమ ఇటీవల మూతబడింది. ఆ పరిశ్రమలో పనిచేసే 242 మంది కార్మికులను నిలిపివేయడంతో సిఐటియు ఆధ్వర్యంలో కోర్టును ఆశ్రయించారు. పోరాట ఫలితంగా స్పందించిన లేబర్ ఆఫీసర్ ఫీల్డ్ విజిట్ చేసి పార్ట్నర్‌షిప్ అయినా నలుగురు యజమానులకు నోటీసులు పంపడంతో పాటు, గత నెల జీతాన్ని కార్మికులకు ఇప్పించారు. వింగ్ టెక్ మొబైల్ పరిశ్రమను లక్స్‌షేర్ ప్రెసిషన్ ఇండస్ట్రీ కంపెనీకి అమ్మేశారు. మార్కెటింగ్ ప్రారంభమయ్యాక తామే కార్మికులను కొనసాగించి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో అప్పటివరకు వింగ్‌టెక్ పరిశ్రమే ఆ కార్మికులకు వేతనాలు ఇవ్వనుంది. అయితే కార్మికుల్లో మాత్రం అభద్రతాభావం నెలకొనే ఉంది.

'నియోలింక్'నిరంకుశ వైఖరి

నియోలింక్ ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ పరిశ్రమ కార్మికుల పట్ల నిరంకుశ వైఖరిని అవలంబిస్తోంది. ఓటీలకు రిడక్షన్ల పేరిట కార్మికుల వేతనాల్లో కోతలు పెడుతూ కార్మికుల చేత వెట్టిచాకరీ చేయిస్తోంది. మహిళా కార్మికుల పట్ల కనీస కనికరం లేకుండా 12 గంటలు పని చేయించుకుంటూ శ్రమదోపిడికి పాల్పడుతోంది. సుమారు 2500 మంది పనిచేస్తున్న పరిశ్రమలో సరిపడా పారిశుద్ధ సిబ్బంది లేరనీ, కేవలం నాలుగు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయని సమాచారం. యాజమాన్య నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా కార్మికులు పరిశ్రమ ఎదుట ఇటీవల ఆందోళన చేపట్టారు. మారిన లేబర్ కోడ్ల ప్రకారం నెలకు(12 గంటల పని విధానం) 24 వేలు కనీస వేతనం చెల్లించాల్సి ఉండగా, జూలై నెలకు యాజమాన్యం కేవలం రూ.15 వేలు మాత్రమే చెల్లించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక గంట పని విరామం నిబంధన ఉన్నా అర్ధగంట మాత్రమే సమయం ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్ధగంట దాటితే ఐడి కార్డులను లాక్కొని, దుర్భాషలాడుతూ బయట నిలబెడుతున్నారని వాపోయారు. గతంలో క్యాంటీన్, బస్సు రవాణా ఖర్చులు యాజమాన్యం ఉచితంగా అందిస్తుండగా ప్రస్తుతం రిడక్షన్ల పేరిట వేతనాల్లో కోత పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ మహిళ కార్మికురాలు 23 దినాలు డ్యూటీ చేస్తే కేవలం 6 వేలు మాత్రమే జీతం పడిందని తెలుస్తోంది.

గ్రామస్తులకు శాశ్వత ఉద్యోగాలివ్వాలి : కరీముల్లా, సిఐటియు, ఏర్పేడు

పరిశ్రమల ఏర్పాటుకు భూములను ఇచ్చిన గ్రామస్తులకు శాశ్వత ఉద్యోగాలను ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలి. లేబర్ అధికారులు, కార్మిక శాఖ సిబ్బంది పరిశ్రమల నిరంతర పర్యవేక్షణతోనే కార్మికులకు న్యాయం జరుగుతుంది. పరిశ్రమల్లో ఇటీవల కార్మికులు మృతిచెందడం, అగ్ని ప్రమాదాలపై యాజమాన్యంపై చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలి. లేదంటే పోరాటాలు చేసైనా కార్మిక హక్కులు దక్కించుకుంటాం.

బ్రహ్మోత్సవాల్లో ఉపరాష్ట్రపతి, సిఎం

చిన్నశేష, హంస వాహనాలపై మలయప్ప

ప్రజాశక్తి - తిరుమల

భారత ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురువారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు ఉపరాష్ట్రపతి చేరుకోగానే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, టిటిడి చైర్మన్ బీఆర్ నాయుడు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ధ్వజస్తంభానికి నమస్కరించుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. వకుళామాత, విమాన వేంకటేశ్వరస్వామి, భాష్యకార్ల సన్నిధి, యోగ నరసింహస్వామివారిని దర్శించుకున్నారు. వేదాశీర్వచనం అనంతరం వారికి స్వామి వారి తీర్థప్రసాదాలను అందించారు. అటు తరువాత 2026 సంవత్సరానికి సంబంధించిన టిటిడి క్యాలెండర్లు, డైరీలను ఉపరాష్ట్రపతికి అందించారు.

చిన్నశేష, హంసవాహనాలపై మలయప్ప

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన గురువారం ఉదయం శ్రీ మలయప్పస్వామివారు ఐదు తలల చిన్నశేష వాహనంపై గురువాయూరు శ్రీకష్ణుడి అలంకారంలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఏనుగులు, అశ్వాలు ముందు కదులుతుండగా భక్తుల కోలాటాలు, మంగళ వాయిద్యాలు, ఇతర కళాప్రదర్శనల నడుమ వాహనసేవ అత్యంత రమణీయంగా జరిగింది. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు హంస వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. వాహనసేవలో తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, బోర్డు సభ్యులు, సివిఎస్వో మురళికష్ణ పాల్గొన్నారు.

ప్రశంసలు అందుకున్న తుడా చైర్మన్

ఉపరాష్ట్రపతి సీపీ రాధాకష్ణన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నుంచి తుడా చైర్మన్, టీటీడీ బోర్డు సభ్యులు డాలర్స్ దివాకర్ రెడ్డి గారు ప్రశంసలు అందుకున్నారు. తుడా చైర్మన్ గా పదవి బాధ్యతలు చేపట్టిన మూడు నెలల వ్యవధిలో అనేక సంక్షేమ అభివద్ధి కార్యక్రమాలు చేసి చూపిస్తూ కూటమీ ప్రభుత్వం పట్ల ప్రజల్లోమరింత నమ్మకాన్ని కల్పిస్తున్న డాలర్స్ దివాకర్ రెడ్డి పనితీరును నారా చంద్రబాబునాయుడు వారు మెచ్చుకుంటూ ఉపరాష్ట్రపతి సిపి రాధాకష్ణన్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి డాలర్స్ దివాకర్ రెడ్డిని మెచ్చుకుంటూ ప్రశంసించారు.

డిజిటల్ జియోట్యాగ్స్‌తో సత్ఫలితాలు

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో తప్పిపోయిన పిల్లలను పోలీసుల ఆధ్వర్యంలో డిజిటల్ జియో ట్యాగ్ సత్ఫలితాలను ఇస్తోంది. తప్పిపోయిన వారిని కుటుంబ సభ్యులకు సురక్షితంగా చేరుస్తోంది. మొదటిరోజే ఏడుగురు భక్తులను, రెండో రోజు ఐదుగురు పెద్దలు, ముగ్గురు చిన్నవారిని సురక్షితంగా అప్పగించారు. జియోట్యాగ్ సదుపాయం తిరుమలలో మాత్రమే కాకుండా తిరుపతి రైల్వేస్టేషన్, బస్టాండ్, టిటిడి సత్రాల్లో అందుబాటులో ఉంచారు. జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో తిరుమల, తిరుపతిలో క్రౌడ్ మేనేజ్‌మెంట్, ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల భద్రత, తప్పిపోయిన వారిని గుర్తించి బంధువులకు చేరవేస్తున్నారు.

పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న ఉప రాష్ట్రపతి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

ఉప రాష్ట్రపతి రాధాకష్ణన్ గురువారం తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు అర్చకులు సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆయన ఆలయంలోని ధ్వజస్తంభానికి మొక్కుకుని శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆశీర్వాద మండపంలో టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు, జేఈవో వీరబ్రహ్మం అమ్మవారి ప్రసాదాలు అందజేసి శేష వస్త్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్య ప్రసాద్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, టీటీడీ బోర్డు సభ్యులు దివాకర్ రెడ్డి, రామ్మూర్తి,కలెక్టర్ వెంకటేశ్వర్లు, సీవీఎస్వో మురళీకష్ణ, తిరుచానూరు ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి శ్రీవారి బ్రహ్మోత్సవాలకు శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో నుండి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ రేవతి పేర్కొన్నారు. స్థానిక డిపో కార్యాలయంలో గురువారం ఆమె మీడియా సమావేశం నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ప్రస్తుతం తిరుమలకు 25 ప్రత్యేక బస్సులును నడుపుతుండగా, అదనంగా మరో రెండు బస్సులను కేటాయించామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్త్రీ శక్తి పథకం ఆర్టీసీకి పూర్వవైభవాన్ని తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. బస్సుల కొరత వల్ల స్త్రీ శక్తి పథకానికి కొంత ఇబ్బంది ఏర్పడుతోందనీ, ఉన్నతాధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని వివరించారు.

ఒకేషనల్ కోర్సులతో భవిష్యత్‌కు పునాదులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఒకేషనల్ కోర్సులతో విద్యార్థులు భవిష్యత్తుకు సరైన పునాదులు వేసుకోవచ్చని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య అన్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పాఠశాలలో అమలు జరుగుతున్న ఎలక్ట్రానిక్స్ ఒకేషనల్ కోర్స్ దసరా సెలవుల్లోనూ పదవ తరగతి విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎలక్ట్రానిక్ షాపుల్లో విద్యార్థులకు ఎలక్ట్రానిక్ వస్తువుల పనితీరుపై ప్రాక్టికల్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాలలో ఒకేషనల్ కోర్సులు అమలు జరగడం ద్వారా విద్యార్థులు చదువుతోపాటు తమకు నచ్చిన వృత్తి విద్యలను నేర్చుకోవచ్చని తెలిపారు. ఎలక్ట్రానిక్ ట్రైనర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

రేపు'ఏహెచ్'లో మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఈ నెల 27వ తేదీన స్థానిక ఏరియా ఆసుపత్రి ఆవరణలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పథకంలో భాగంగా ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళీకష్ణా రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని సాధారణ వ్యాధులతో పాటు క్యాన్సర్ లాంటి దీర్ఘకాలిక రోగాలకు అనుభవజ్ఞులైన వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. తూర్పు మండలాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

అన్నా రామచంద్రయ్య ఇంట్లో తీవ్ర విషాదం

- రోడ్డు ప్రమాదంలో అల్లుడు, మనవరాలు మృతి
- నిశ్చితార్థానికి గుంటూరుకు వెళుతుండగా ఘటన

గంగమ్మ జాతర సందర్భంగా తండ్రి కూతుళ్ల ఫైల్‌ఫొటో

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ప్రముఖ రాజకీయ నాయకుడు అన్నా రామచంద్రయ్య యాదవ్ ఇంట్లో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. పెద్ద కుమార్తె తిరుపతి నగరపాలక సంస్థ 49వ డివిజన్ కార్పొరేటర్ అన్నా సంధ్య యాదవ్, ఆమె భర్త డాక్టర్ వెంకట కిషోర్(47), కుమార్తె అశ్వినందిని (7), కుమారుడుతో సహా ఇతర బంధువులతో కలిసి గుంటూరులో జరిగే నిశ్చితార్థ వేడుకకు హాజరవ్వడానికి తిరుపతి నుండి కారులో బయలుదేరారు. గుంటూరు జిల్లా చిలకలూరిపేట రూరల్ మండలం తాతపూడి గ్రామం వద్దగల బైపాస్ రోడ్డు మార్గంలో వేగంగా డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాద ఘటనలో అన్నా సంధ్యా యాదవ్ భర్త వెంకట కిషోర్ ప్రమాద ఘటనలోనే ప్రాణాలు విడువగా, ఆమె కుమార్తె అశ్వినందిని చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో అన్నా సంధ్య యాదవ్ తో పాటుగా పిల్లలకు గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే కుటుంబ సభ్యులు హుటాహుటిన గుంటూరు బయలుదేరారు. తిరుపతిలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా అందరికీ సుపరిచితుడైన అన్నా రామచంద్రయ్య యాదవ్ ఇంటిలో ఇటువంటి దుర్ఘటన జరగడం, అల్లుడు, మనవరాలు మతి చెందడం పట్ల పలువురు రాజకీయ నాయకులు, బీసీ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున గుంటూరుకు వెళ్లి డాక్టర్ వెంకట కిషోర్, అశ్వినందిని మతదేహాలకు వైసిపి ఉమ్మడి చిత్తూరు జిల్లా ఇన్చార్జి భూమన కరుణాకర్ రెడ్డి, బిసి సంఘం నాయకులు లాకా వెంగళరావు, అఖిల భారతీయ యాదవ మహాసభ యువత నాయకులు శంకర్ యాదవ్, పలువురు ప్రముఖులు నివాళు లర్పించారు. అన్నా రామచంద్రయ్య ఇంట్లో ఈ విషాద ఘటన నేపథ్యంలో పెద్ద ఎత్తున ఆయన మద్దతుదారులు గుంటూరుకు చేరుకున్నారు. తిరుపతి నగర మేయర్ డాక్టర్ శిరీష ఓ ప్రకటనలో నివాళి అర్పించారు. కార్పొరేటర్ డాక్టర్ సంధ్య త్వరగా కోలుకోవాలన్నారు.



గుంటూరులో నివాళి అర్పిస్తున్న కరుణాకర్‌రెడ్డి

చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ ఏది? : సిపిఎం

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్

చేనేత కార్మికులకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ప్రకటించి రెండు నెలలైనా ఎందుకు అమలు చేయలేదని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం బృందం బంగారుపేట ఏరియాలో పర్యటించి చేనేత కార్మికుల సమస్యలను ప్రాంతీయ కార్యదర్శి వడ్డిపల్లి చెంగయ్యతో కలిసి పరిశీలించారు. చేనేత కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు ఉచిత విద్యుత్‌ను అమలు చేయాలని డిమాండ్‌చేశారు. చేనేత కార్మికులు నేసే చీరలకు గిట్టుబాటు లేదన్నారు. కుటుంబం మొత్తం కష్టపడినా రెండు మూడు వందలు కూడా రోజుకు రావడం లేదన్నారు. వర్షాలు వస్తే పరిస్థితి దుర్భరంగా ఉంటుందని నేతన్నలు తెలిపారు. జాతీయస్థాయిలో వెంకటగిరి చేనేత వృత్తికి అనేక అవార్డులు, రివార్డులు అందుకుంటున్నా, వారి జీవితాలు మాత్రం ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయన్నారు. జిల్లాలో ఆరువేలకు పైగా నేతన్న కుటుంబాలు ఉన్నాయని, సగం మంది పైనే వెంకటగిరి ప్రాంతంలో ఉన్నారన్నారు. 15వేల జనాభా ఈ వృత్తిపై ఆధారపడి జీవనాన్ని సాగిస్తున్నారన్నారు. ఉచిత విద్యుత్ అందించి, 24వేల రూపాయల ఆర్థిక సాయం అందించాలన్నారు. సిపిఎం నాయకులు ఐలా భాస్కర్, సుబ్బరాయులు, చంద్రశేఖర్, భద్రయ్య, గణేష్ పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగులకు పాతపెన్షన్ ఇవ్వాలి

తిరుపతి టౌన్ : రైల్వే ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కొత్త పెన్షన్ వల్ల నష్టం జరుగుతుందని నేతలు పేర్కొన్నారు. సెప్టెంబర్ 21, 22 తేదీల్లో ఇండియన్ రైల్వే ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాలుగో వార్షికోత్సవ సమావేశం వారణాసిలో జరిగింది. సమావేశానికి పార్లమెంట్ సభ్యులు సుధామప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అఖిలభారత నాయకులు శంకర్, రాజీవ్ తిమ్మిరిహ పాల్గొన్నారు. ప్రధానంగా 'యూనిఫైడ్ పెన్షన్ స్కీం' వద్దని ఓల్డ్ పెన్షన్ అమలు చేయాలని కోరారు. రైల్వేలో ప్రైవేటీకరణను, ఔట్‌సోర్సింగ్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. నేషనల్ అధ్యక్షులుగా అఖిలేష్ కుమార్ పాండే, జాతీయ ప్రధాన కార్యదర్శిగా సర్వజిత్ సింగ్ఎన్నికయ్యారు. సౌత్ ఇండియా ప్రతినిధులుగా ఎస్ మీరయ్య జాతీయ ఉపాధ్యక్షులు, సహాయ ప్రధానకార్యదర్శిగా కే యోహన్, సహాయ ప్రధాన కార్యదర్శిగా కే హేమంత్ కుమార్ ఎన్నికయ్యారు. నవంబర్ 25వ తారీఖున జరిగే పాత పెన్షన్స్ స్కీం సాధన కొరకు జరిగే కార్యక్రమంలో ఢిల్లీకి కార్మికులంతా తరలి రావాలని నూతన కమిటీ కోరింది.

పరిసరాల పరిశుభ్రతతో 'స్వచ్ఛ తిరుపతి'

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

పరిసరాల పరిశుభ్రతతో స్వచ్ఛ తిరుపతి సాధ్యమని ఆ దిశగా ప్రజలందరూ అడుగులు వేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఉదయం మహిళా విశ్వవిద్యాలయం, ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ లో శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వచ్ఛత హి సేవను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని తెలిపారు. వ్యక్తిగత శుభ్రత ఎంత ముఖ్యమో, పరిసరాల పరిశుభ్రతా అంతే ముఖ్యమని తెలిపారు. దేశ ప్రధాని మోడీ జన్మదినం నుంచి మహాత్మా గాంధీ జయంతి వరకు దేశ వ్యాప్తంగా "స్వచ్ఛత హి సేవ" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. పారిశుధ్య కార్మికులతో భాగస్వామ్యం అయ్యి పరిసరాలను పరిశుభ్రం చేస్తున్నామన్నారు. డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికష్ణ, మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఉమా, డిప్యూటీ కమిషనర్ అమరయ్యలు మాట్లాడుతూ మన ఇళ్లే కాకుండా మన పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. విద్యార్థుల్లో ఈ మార్పు తెస్తే త్వరగా ప్రజల్లో అవగాహన వస్తుందని తెలిపారు.

రాహు-కేతు పూజల్లో బ్రాహ్మణి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సతీమణి రాహు-కేతు సర్ప దోష నివారణ పూజలు చేసుకున్నారు. బ్రాహ్మణి గురువారం కుమారుడు దేవాన్ష్ తో కలిసి శ్రీకాళహస్తీశ్వరాలయానికి రాగా బొజ్జల బందమ్మ, రిషితా రెడ్డి సాదర స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవారి దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వచనాలు పలికగా, బృందమ్మ, రిషితా రెడ్డి ముక్కంటి తీర్థప్రసాదాలు, కలంకారి జ్ఞాపికలు అందజేశారు.

శ్రీకాళహస్తిలో బ్రాహ్మణి, బృందమ్మ, రిషితారెడ్డి

అప్పడాల తయారీ పరిశ్రమ ప్రారంభం

ప్రజాశక్తి - రేణిగుంట

పిఎంఎఫ్ఎంఇ స్కీం ద్వారా 10శాతం సబ్సిడీతో లోను తీసుకుని రేణిగుంటలో అప్పడాల తయారీ పరిశ్రమను తిరుపతి జిల్లా డిఎంఐఒ ప్రాజెక్టు డైరెక్టర్, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఇక్స్యూటివ్ డైరెక్టర్ చిన్నరెడ్డయ్య చేతుల మీదుగా గురువారం ప్రారంభించారు. ఆసక్తిగల యువతీ యువకులు ముందుకు వచ్చి ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకుని మరికొంతమందికి ఉపాధి కల్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7799128020 ఫోన్ నంబర్‌లో సంప్రదించి సబ్సిడీ రుణాలు పొందాలని తెలియజేసారు.

సిఐటియు నిరసన

ప్రజాశక్తి -రేణిగుంట రేణిగుంట పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సిఐటియు నాయకులు కాంబేరి సెల్వరాజ్ మాట్లాడుతూ కార్మికులకు పనిగంటల పెంపుపై ధ్వజమెత్తారు. ఏమాత్రం కార్మికసంఘాల నాయకులతో చర్చలు జరపకనే అసెంబ్లీలో తీర్మానం చేయడం ఏంటని ప్రశ్నించారు. ఎనిమిది గంటల పని దినాన్నే అమలు చేయని పక్షంలో కార్మికులంతా ఏకమై పెంచిన పని గంటలు రద్దు చేసేంత వరకూ పోరాడతామన్నారు.

ఆరోగ్య పరిరక్షణలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకం

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి: ప్రజా ఆరోగ్య పరిరక్షణలో ఫార్మాసిస్ట్ ల పాత్ర కీలకమని జిల్లా డ్రగ్గిస్ట్ అండ్ ఫార్మాసిస్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అమరా జనార్దన్ పేర్కొన్నారు. ఫార్మాసిస్ట్ దినోత్సవం సందర్భంగా శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన ప్రముఖ ఫార్మాసిస్టులు రాము గుప్తా, చక్రపాణి కొండేటిలను ఆయన గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 32 మంది ఎంపిక

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని, గోవింద పాలెం, శ్రీ విద్యా డిగ్రీ కళాశాలలో గురువారం మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ వారు బెంగళూరుకు చెందిన గ్లో లాజిక్స్ సొల్యూషన్ కంపెనీలో ఉద్యోగాలకు క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో 110 మంది పాల్గొనగా, 32 మంది తృతీయ సంవత్సరం బిఎస్సి, బీకాం విద్యార్థులు ఎంపికయ్యారు.ఈ కార్యక్రమంలో మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ చిత్తూరు జిల్లా ప్లేస్మెంట్ ఆఫీసర్ వెంకటప్రసాద్, శ్రీవిద్య కళాశాల ఛైర్మన్ డాక్టర్ జి.ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రకు సత్కారం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): వైసీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన చింతా రాజేంద్రని గురువారం లీగల్ సెల్ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షులు వీరేంద్ర ఆచారి ఘనంగా సన్మానించారు. లింగమనాయుడు పల్లిలోని రాజేంద్ర నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. దళితుల తరఫున పోరాటాలు చేపట్టాలని ఆకాంక్షించారు.

అనుసంధాన భాష హిందీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: మనదేశంలో అన్ని ప్రాంతాలను కలిపే జాతీయ భాష హిందీ అని డాక్టర్ చంద్రమోహ్ పేర్కొన్నారు. హిందీ భాష పక్షోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరులో హిందీ విభాగం ఆధ్వర్యంలో హిందీ భాషా విశిష్టత అనే అంశంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కోటేశ్వరయ్య, హిందీ విభాగ అధ్యక్షులు డాక్టర్ వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన.. కల్వర్టుకు మరమ్మతులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం, తడుకు వద్ద కల్వర్టు పగిలిపోవడంపై ప్రజాశక్తిలో వచ్చిన వార్తకు స్పందించిన సర్పంచ్ పి.వెంకటేష్ శెట్టి పైపులు వేసి కల్వర్టును మరమ్మతు చేయించారు. దీంతో సిరుగురాజు పాలెం, తడుకు పంచాయితీ గ్రామాలకు రాక పోకల ఇబ్బంది తొలగిందని దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వై.సదయ్య తెలిపారు. దీంతో పంచాయతీయ ప్రజలు సర్పంచ్ వెంకటేష్, సెక్రటరీ అనిల్ కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు.

మనోహరాచారి కుటుంబాన్ని ఆదుకోండి

సీఎంకు వినతి పత్రం ఇస్తున్న నరసింహ యాదవ్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ గురువారం తిరుపతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కన్నుమూసిన టీడీపీ పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి మనోహర్ ఆచారి కుటుంబానికి ప్రభుత్వ పరంగా సహాయం అందించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. మనోహర్ ఆచారి దీర్ఘకాల సేవలను గుర్తుచేసుకుంటూ, ఆయన పార్టీ పట్ల చూపిన నిబద్ధతను నరసింహ యాదవ్ ప్రస్తావించారు. కుటుంబానికి తగిన ఆర్థిక, సామాజిక రీత్యా ప్రభుత్వం అండగా నిలవాలని, ముఖ్యంగా మనోహర్ ఆచారి కుమారుని భవిష్యత్తు కోసం సహాయక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీఎం వినతిపత్రాన్ని స్వీకరించి, కుటుంబానికి సహాయం చేసే దిశగా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని నరసింహ యాదవ్ తెలిపారు.

మహిళలకు వైద్య శిబిరం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి, ఎయిర్ బైపాస్ రోడ్ లోని ఉత్తీత మినీ సర్కూట్స్ కంపెనీలో పనిచేసే సిబ్బందికి గురువారం ఇఎస్ఐ ఆసుపత్రి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఎస్ఐ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్యామలా మాట్లాడుతూ ఈఎస్ఐ సంస్థ లబ్ధిదారులకు, వారి కుటుంబానికి అందిస్తున్న వైద్య సదుపాయాలు, ఇతర బెనిఫిట్స్ పైన ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో డాక్టర్లు చందన,హేమ కుమారి, స్వప్న మంజరి తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా హరినాథ్ రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ కౌన్సిల్ సభ్యులుగా చిత్తూరు జిల్లాకు చెందిన పి హరినాథ్ రెడ్డి ఎంపికయ్యారు. సిపిఐ 25వ జాతీయ మహాసభలు పంజాబ్ రాష్ట్రంలోని చండీగఢ్ లో ఈనెల 21వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జరిగాయి. మహాసభలు చివరి రోజైన గురువారం జాతీయ కౌన్సిల్ నూతనంగా ఎన్నికయింది. జాతీయ కౌన్సిల్ కు ఆంధ్రప్రదేశ్ నుంచి ఏడుగురు ఎంపిక అయ్యారు. అందులో చిత్తూరు జిల్లా నుండి సీనియర్ నాయకుడైన పి హరినాథ్ రెడ్డికి చోటు లభించింది.

విద్య విలువ చంద్రబాబుకే ఎరుక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : విద్య విలువ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు మాత్రమే తెలుసని తిరుపతి టీడీపీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎం.ఉమేష్ రావు పేర్కొన్నారు. డీఎస్సీ ఉత్తీర్ణులైన సుమారు 16 వేల మంది నిరుద్యోగులకు ఉపాధ్యాయ నియామక పత్రాలు అందజేసి చరిత్రలో సువర్ణాధ్యాయాన్ని లిఖించారని కొనియాడారు. గత వైఎస్ జగన్ పాలనలో ఒక్క ఉపాధ్యాయ నియామకం కూడా జరగలేదని విమర్శించారు.

సబ్ జైలు వార్డర్‌కు నేషనల్ అవార్డు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి స్పెషల్ సబ్ జైల్ హెడ్ వార్డెర్ నేషనల్ అవార్డు సాధించారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో జరిగిన 7వ ఆల్ ఇండియా ప్రిజన్ డ్యూటీ మీట్‌లో సెప్టెంబర్ 7 నుండి 11 తేదీ వరకు జరిగిన షార్ట్ పుట్ ఈవెంట్‌లో 3స్థానంలో రజతం పతకం సాధించిన హెడ్ వార్డర్ స్పెషల్ సబ్ జైలు వై.సుధాకర్‌ను పలువురు అభినందించారు. సూపరింటెండెంట్ రామకృష్ణ యాదవ్, డిప్యూటీ జైలర్ శ్రీకాంత్, సిబ్బంది సమక్షంలో గురువారం జైలు ప్రాంగణంలో ఆయనను ఘనంగా సత్కరించారు.

వ్యర్థాలతో వ్యథ

- కంపు కొడుతున్న తెలుగు గంగ కాలువ
- మాంసం వేస్ట్‌తో దుర్వాసన
- ఈగల మోత.. అనారోగ్యంతో వెత
- అధికారుల కంటి తుడుపు చర్యలు

తెలుగు గంగ కాలువలో మాంసం వ్యర్థాలు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని చికెన్, చేపల దుకాణదారులు, కోడి, చేపల వ్యర్థాలను జనావాసంలో మెయిన్ రోడ్డుకు ప్రక్కన ఉన్న తెలుగుగంగ కుడి కాలవలో వ్యర్థాలను పారేస్తుండటంతో స్థానికులు దుర్వాసన భరించలేకున్నామని మొరపెట్టుకుంటున్నారు. వ్యర్థాలపై వాలుతున్న ఈగలతో అనారోగ్యం పాలవుతున్నామని ఆందోళన చెందుతున్నారు. బుచ్చినాయుడు కండ్రిగ మండల కేంద్రంలో సుమారు 5 చికెన్, 6 చేపల షాపులు నిర్వహిస్తున్నారు. వీటినుండి రోజుకు సుమారు అర టన్ను వరకు వ్యర్థాలు సమకూరుతున్నాయి. వాటిని పంచాయతీలో వ్యర్థాలు సేకరించే వాహన సిబ్బందికి అప్పగించాలి. కానీ అధిక శాతం వ్యర్థాలను సాయంకాలం అయితే ప్రక్కనే ఉన్న తెలుగు గంగ కుడి కాలవలో, జనావాసమున్న ప్రాంతాల్లోనే రహదారి పక్కన పడుస్తున్నారు. దుర్వాసన కలిగిన వ్యర్థాలలో వివిధ రకాల జీవాల పేగులు, మాంసం ఉండడంతో అవి కుళ్ళి దుర్గంధ భరితమై దుర్వాసనతో ఈగలకు ఆవాసంగా మారుతున్నాయి. శ్రీకాళహస్తి వెళ్లే రోడ్డు మార్గంలో ఉన్న చికెన్ వ్యర్థాలు కొందరు తెలుగు గంగ కుడి కాలవ లోపల విసిరేస్తున్నారు. ఈ వ్యర్థాలు కుళ్ళి కాలువలో నీరు లేనందువలన వాటిని కాకులు, ఇతర పక్షులు తీసుకెళ్లి విద్యుత్ స్తంభాల పైన పెట్టడంతో విద్యుత్ లైన్ల ట్రిప్పయి చాలా మంది ఇండ్లలో టీవీలు ఫ్రిజ్‌లు కాలిపోయాయని స్థానికులు తెలిపారు. విద్యుత్ అధికారులు దుకాణదారులను హెచ్చరించినా వారు స్పందించడంలేదు. గతంలో ఈ విషయమై పలుమార్లు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. అయితే ఈ చర్యలన్నీ కేవలం కంటి తుడుపు చర్యలుగా ఉండడంతో సమస్య యథాతథంగా కొనసాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి చికెన్, చేపల వ్యర్థాలను నియంత్రించడానికి పటిష్టమైన చర్య చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యర్థాలను సేకరించే పంచాయతీ వాహనం సరైన సమయానికి అందుబాటులోకి లేదు. వాస్తవానికి ఉదయం ఒకసారి, సాయంత్రం ఒకసారి వ్యర్థాలను తొలగించాల్సి ఉంది. పంచాయతీ వాహనం ఉదయం మాత్రమే వచ్చి వెళుతోంది. సాయంత్రం పంచాయితీ వాహనం రాకపోవడంతో ఆ వ్యర్థాలను ఉదయం వరకు నిల్వచేయడం సాధ్య పడటం లేదు.

- చికెన్ షాపుల యజమానులు

8 గంటల పని విధానాన్నే కొనసాగించాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్: ఎనిమిది గంటల పని విధానాన్నే కొనసాగించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, ఏ. ఐ.టి.యు.సి నియోజకవర్గ కార్యదర్శి నారాయణ డిమాండ్ చేశారు. గురువారం గూడూరు, టవర్ క్లాక్ సెంటర్ వద్ద ఏ. ఐ.టి. యు.సి నియోజకవర్గ సమితి అద్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశి కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు సునీల్ , బిల్డింగ్ వర్కర్స్ నాయకులు మీరాభాయ్, శ్రీనివాసులు , మోహన్ , తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: వెంకటగిరి మున్సిపల్ కార్యాలయం వద్ద ఎఐటియుసి ఆధ్వర్యంలో కార్మికుల పని గంటలు పెంపుపై మున్సిపల్ వర్కర్స్ గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కల్లూరు జాన్ మాట్లాడుతూ 13 గంటల పని విధానం కార్మికుల శ్రమను దోచుకోవడమూనన్నారు. ఈ కార్యక్రమంలో, సిపిఐ టౌన్ సెక్రటరీ, శివకుమార్ స్ట్రీట్ వెండర్స్ నాయకులు. ఎన్.నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పనిగంటలను 8 నుంచి 13కు పెంచుతూ చేసిన తీర్మానాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, కోరుతూ స్థానిక భవన నిర్మాణ కార్మికుల కూడలి వద్ద

ఏఐటీయూసీ డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శి, గోపి కార్యదర్శి చంద్రబాబు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు కైలాసం, భాస్కర్, వెంకట ముని, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చంద్రగిరి: పనిగంటల పెంపదలపై నిరసిస్తూ ఏపీ స్కీంవర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో చంద్రగిరి టవర్ క్లాక్ దగ్గర నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఏఐటీయూసీ ఇన్చార్జి కేవై రాజా, సిపిఐ మండల కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ పని గంటల పెంపుదల తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఎన్ శ్రీరాములు. కే వై రాజా.గీత పార్వ దేశమ్మ కళావతమ్మ గీత తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఉత్పత్తులను నమ్మొద్దు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: రాష్ట్రంలో నకిలీ జిఎస్‌డబ్ల్యూ సిల్వర్ ఉత్పత్తులు విక్రయిస్తున్నారని, వాటిని వినియోగదారులు నమ్మవద్దని ఆ సంస్థ ప్రతినిధి మహేష్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడపలో జెఎస్‌డబ్ల్యూ స్టీల్ కోటెడ్ బృందం నకిలీ జెఎస్‌డబ్ల్యూ సిల్వర్ పూత కలిగిన షట్టర్ ఉత్పత్తులను పసిగట్టిందని, స్థానిక పోలీసులతో సంయుక్తంగా నిఘా పెట్టి ఎస్ డిఎస్, సన్స్ పై దాడి చేసి 18 నకిలీ ఉత్పత్తులు, ఎచింగ్ మోల్డ్ స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. జెఎస్‌డబ్ల్యూ సిల్వర్ మార్క్‌తో చట్టవిరుద్ధంగా గుర్తించబడిన 18 షట్టర్ భాగాలను, ముద్రణ కోసం ఉపయోగించే సంబంధిత అచ్చును స్వాధీనం చేసుకున్నారు.

స్విమ్స్‌లో అంతర్జాతీయ బధిరుల వారోత్సవాలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: స్విమ్స్ ఇఎన్టీ విభాగం ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ బధిరుల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్.వి.కుమార్ మాట్లాడుతూ వినికిడి లోపం పుట్టుకతోనే రావచ్చు లేదా వయస్సుతో, వ్యాధులతో, పర్యావరణ శబ్దల వల్ల రావచ్చునని, మనిషికి 75–85 డిసిబిల్స్ శబ్దానికి ఎక్కువ గురియ్యిన వినికిడి తగ్గిపోతుందని తెలిపారు.వినికిడి లోపం వున్నవారికి హియిరింగ్ ఎయిడ్స్, కొక్లియర్ ఇంప్లాంట్స్ వంటి ఆధునిక చికిత్సలు అందుబాటులో వున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇ.ఎన్.టి. విభాగపు వైద్యులు భానుప్రదీప్, సాయి మౌర్య, ప్రత్యూష, భవ్య, హాసిని, మహేష్, మషీరా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మురళి మోహన్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండో పట్టణ పరిధి, బీసీ కాలనీలో తిరుపతి రవాణా శాఖాధికారి కొర్రపాటి మురళి మోహన్ 59 వ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ రావు, శివ మాట్లాడుతూ గూడూరు ఆర్టీవోగా ప్రజలకు మెరుగైన సేవలు చేశారని కొనియాడారు.

ఘనంగా జాతీయసేవా పథకం దినోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ సి భువనేశ్వరి నేతృత్వంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్వియూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య దామోదరం, ఎస్‌బిఐ బ్యాంక్ మేనేజర్ దేవేంద్రతో కలిసి కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం ఎన్ఎస్ఎస్ విద్యార్థినిలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఆచార్య దామోదరం మాట్లాడుతూ విద్యార్థినిలు చదువుతోపాటు, నైపుణ్యాలను పెంపొందింపచేసుకోవడానికి, ఎన్ఎస్ఎస్ ఉపయోగకరమన్నారు.

సిఐటియు మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : చిల్లకూరు మండల పరిధి, చిల్లకూరు సెక్టార్, గూడూరు మండల పరిధిలోని చెన్నూరు సెక్టార్‌లలో అంగన్వాడి కార్యకర్తల సమావేశం అధ్యక్ష, కార్యదర్శులు ఇంద్రావతి, ప్రభావతిల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో గూడూరు సిఐటియు పట్టణ ప్రధాన కార్యదర్శి రమణయ్య, ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ 31 నుండి 2026 జనవరి 4 వరకు ఐదు రోజులపాటు సిఐటియు అఖిల భారత మహాసభలను నిర్వహిస్తుందని, విశాఖపట్నంలో జరిగే ఈ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు సెక్టార్ అంగన్వాడి లీడర్ ప్రసన్న, కామాక్షి, చిల్లకూరు సెక్టార్ పెంచలమ్మ, లీలావతి, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పంట పశువుల పాలు.. రైతు కన్నీటి పాలు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండల పరిధిలోని నీర్పకోట గ్రామానికి చెందిన సిపిఎం మండల కార్యదర్శి రమణయ్య గ్రామ రెవిన్యూలో ఉన్న భూమిలో పండించిన ధాన్యాన్ని మార్కెట్ యార్డ్‌లో పట్టలపై ఆరబెట్టి ఉంచారు. మార్కెట్ యార్డుకు చుట్టుప్రక్కల ప్రహరీ గోడ లేకపోవడంతో విచ్చలవిడిగా పశువులు సంచారం చేస్తున్నాయి. ఈ పశువులు రమణ య్య ఆరబెట్టిన ధాన్యన్ని సగానికి పైగా తినేశాయి. దీంతో పడిన కష్టం వృధా అయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పశువుల యజమానులు తమ జీవాలను విచ్చలవిడిగా వదిలేయడంతో అవి ప్రభుత్వ కార్యాలయాల్లో, బాస్టాండులో, మార్కెట్ యార్డులో తిరుగు తూ దొరికింది తినేస్తున్నాయని రమణయ్య ఆరోపించారు. ఇకనైనా పశువుల యజమాను లు వాటిని మేతకు వదిలేప్పుడు కట్టుదింట్టం చేసుకోవాలని కోరారు. ఈ విధంగా పశువుల ను ఊరిమీద వదులుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడంలేదని మం డిపడ్డారు. పం డించిన పంట ఒక్కరోజులో నాశనమయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డుకు ప్రహరీ నిర్మించాలని, గేటు పెట్టించి, వాచ్ మెన్‌ను నియమించాలని ఆయన డిమాడ్ చేశారు. రైతుల కష్టం వృధా కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

పులికాట్ పరిసరాల్లో తాటిచెట్ల పెంపకం

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: జపాన్‌కు చెందిన కొబెల్కో గ్రూప్ అనుబంధ సంస్థలు కొబె స్టీల్ 120 వ వార్షికోత్సవం, కోబెల్కో కన్స్ట్రక్షన్ ఎక్విప్మెంట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ శ్రీసిటీ ప్లాంట్ 15వ వార్షికోత్సవాన్ని గురువారం, శ్రీసిటీ పరిశ్రమ ఆవరణలో నిర్వహించింది. ఈ కార్యక్రమంలో చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్ మునియో తకహషి, కాన్సుల్ నవోకో యుజావా, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, కోబెల్కో ఆగ్నేయాసియా మేనేజింగ్ డైరెక్టర్ కసమోరి, కే సి ఈ ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సీఈఓ హయామా, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కేసిఈ ఎల్ఆర్డే ఫౌండేషన్‌తో కలిసి పెద్ద ఎత్తున చెట్ల పెంపకం కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా శ్రీసిటీ , పులికాట్ సరస్సు పరిసరాల్లో 10,000 తాటి మొక్కలను నాటడం లక్ష్యంగా నిర్దేశించుకుంది. శ్రీసిటీలో కేవలం పరిశ్రమలే కాదు, పర్యావరణ వ్యవస్థలను నిర్మిస్తామని ఉద్ఘాటించారు.

నరువి హాస్పిటల్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వేలూరు నరువి హాస్పిటల్, చిత్తూరులోని ప్రీతం హాస్పిటల్ సహకారంతో చిత్తూరు పట్టణ ప్రాంతాలలోని గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులకు, నరాల సంబంధిత రోగులకు మెడికల్ క్యాంపును గురువారం నిర్వహించారు. గుండె, నరాల సంబంధిత అనారోగ్య సమస్యలతో వేలూరులోని నరువి హాస్పిటల్‌కు రావడానికి సమయం, ఖర్చును ఆదా చేయడానికి చిత్తూరు ప్రీతం హాస్పిటల్ సహకారంతో ఈ మెడికల్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నెలకు రెండు పర్యాయాలు నిరంతరం ప్రీతం హాస్పిటల్ లో ఈ మెడికల్ క్యాంపు నిర్వహించబడుతుందన్నారు. ప్రీతమ్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ రాజేంద్ర కుమార్, నర్వి హాస్పిటల్ కార్డియాక్ సర్జన్లు డాక్టర్ వినాయక్ శుక్లా, డాక్టర్ రే జార్జ్ మరియు నరంబిల్ సర్జన్ డాక్టర్ లోకే రోగులను పరీక్షించి చికిత్స అందిస్తారన్నారు. వెల్లూరులోని నరువి హాస్పిటల్‌లో శస్త్రచికిత్స అవసరమయ్యే రోగులకు శస్త్రచికిత్స చేయడానికి ఏర్పాట్లు చేయబడ్డాయన్నారు. ఈ వైద్య శిబిరం ప్రారంభోత్సవంలో నరువి హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శరవణన్ రామన్, డాక్టర్ వినాయక్ శుక్లా, డాక్టర్ రే జార్జ్, డాక్టర్ లోకేష్, ప్రీతమ్ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులకు సంక్షేమ ఫలాలు అందేనా..?

- నామమాత్రపు క్యాంపులతో ఒరిగేదేమిటి
- సంబంధిత పత్రాల ఏర్పాటులో అధికారులు విఫలం
- అవస్థలు పడుతున్న గిరిజనులు

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికి సమానంగా అందించాలని ఇప్పటి వరకు ఆధార్ లేని, కొన్ని కారణాలుగా ఆధార్ పోగొట్టుకున్న గిరిజనులకు ఆధార అందించాలన్న ధ్యేయంతో ప్రభుత్వ ఉన్నత అధికారులు ఈనెల 22వ తేదీ నుండి 27వ తేదీ వరకు వివిధ ప్రాంతాలలో ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేసిన విషయం విధితమే. అయితే క్యాంపులు వల్ల గిరిజనులకు ఒరిగేదేమీ లేకపోగా దినసరి కూలీలు చేసుకునే వారికి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేసే విధంగా నిర్లక్ష్యంగా అధికారులు వ్యవహరిస్తున్నారు.

సరైన గుర్తింపు పత్రాలు లేక గిరిజనులు ఇక్కట్లు

క్యాంపు ఏర్పాటు చేసే ముందే ఆధార్ సంబంధించి కావలసిన అన్ని పత్రాలను స్థానిక అధికారులు ఏర్పాటు చేసుకోవలసి ఉండగా క్యాంపులు నిర్వహిస్తున్న సమయంలో పత్రాలకు సంబంధించిన పనులను చేపట్టడంతో చాలా ఆలస్యం అయిపోయింది. ముఖ్యంగా గిరిజనుల్లో చాలామంది చిన్న పిల్లలకు బర్త్ సర్టిఫికెట్లు లేకపోవడంతో వారు ఆధార్ నమోదు చేసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇందుకు సంబంధించి స్థానిక అంగన్వాడీ కేంద్రాల్లో సైతం వీరికి సంబంధించిన డేటా లేకపోవడంతో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడం తదితర విషయాలు గిరిజనులకు శాపంగా మారింది.

సీఎం పర్యటనలో స్థానిక అధికారులు

తిరుమల బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన ముఖ్యమంత్రి పర్యటనలో స్థానిక అధికారులు పాల్గొంటున్నారు. ఇందుకు సంబంధించి ఎటువంటి పత్రాలు లేని అభ్యర్థులకు తహశీల్దార్ సంతకం చేసి ఇచ్చే పత్రాలు కీలకం. గత రెండు రోజులుగా తహశీల్దార్ అందుబాటులో లేకపోవడంతో క్యాంపులు ఏర్పాటు చేసిన ఫలితం లేకపోయింది.

తల్లికి వందనం అందేదెప్పుడో..?

మునెమ్మ కూతురు సుమతి గోవర్ధన్ పురం ప్రభుత్వ పాఠశాలలో రెండవ తరగతి చదువుతోంది. ఈ చిన్నారికి సంబంధించి ఆధార్ కార్డు తీయించడంలో మునెమ్మ గత రెండు సంవత్సరాలుగా ప్రయత్నిస్తున్నప్పటికీ విఫలమవుతూనే ఉంది. అన్ని పత్రాలు ఏర్పాటు చేసుకున్నప్పటికీ తహశీల్దార్ సంతకం లేని కారణంగా రెండు రోజులుగా కార్యాలయం ఎదుట వేచి ఉండాల్సిన పరిస్థితి. ఆధార్ కార్డు ఉంటేనే తల్లికి వందనం నగదు వస్తుందని అధికారులు చెప్పడంతో తాను ఎన్ని రకాలుగా ప్రయత్నించినా ఫలితం లేదని మునెమ్మ ఆవేదన వ్యక్తం చేస్తోంది.

ఆధార్ కార్డు లేక.. రేషన్ కార్డు రాక

గతంలో వచ్చిన వరదల సమయంలో వెంకటరత్నమ్మకు సంబంధించిన ఆధార్ కార్డులు పోగొట్టుకోవడం జరిగింది. అప్పటినుండి ఆధార్ కార్డు కోసం అధికారుల చుట్టూ తిరగడంతోనే సరిపోతోంది. ఎన్ని మార్లు విన్నవించుకున్న ఫలితం లేదు ఆధార్ కార్డు లేదన్న నెపంతో రేషన్ కార్డులు రాలేదని రేషన్ కార్డు ఉన్నవారికి ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ ఇళ్ల నుండి 100 రోజుల పనుల వరకు ఏ పనికైనా రేషన్ కార్డు, ఆధార్ కార్డులు అడుగుతున్నారని ఈ రెండు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చంటి పిల్లను తీసుకొని కార్యాలయాలు చుట్టూ తిరగలేక అలసిపోతున్నానని, ఇకనైనా అధికారులు తమ గోడును పట్టించుకోని న్యాయం చేయవలసిందిగా కోరుతున్నారు.

నామమాత్రపు క్యాంపులతో ఒరిగేదేమిటి ..?

రోజువారి కూలి చేసుకునే గిరిజనులకు తమ ప్రాంతంలో ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేస్తే కూలి, నాలి చేసుకునే కష్టజీవులు ఆధార్‌ని ఏర్పాటు చేసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందుతారనే ధ్యేయంతో క్యాంపులను ఏర్పాటు చేసినప్పటికీ అవి నామమాత్రపు క్యాంపులుగానే మిగిలిపోతున్నాయి. ముఖ్యంగా ఆధార్ తీయడానికి వస్తున్న ఉద్యోగుల నిర్లక్ష్యపు ధోరణితో ప్రజలకు సరైన న్యాయం జరగడం లేదు. కొన్ని ప్రాంతాలలో ప్రజలకు అర్థమయ్యే విధంగా చెప్పి వారికి కావలసిన పనులను పూర్తి చేసి పంపుతున్నా, ఇప్పుడు ఏర్పాటు చేసిన క్యాంపులో మాత్రం ఇందుకు భిన్నంగా ఉద్యోగస్తులు వ్యవహరించడంతో ప్రజలు కొంత అసహనం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సరైన పత్రాలు ఉన్నప్పటికీ ఏదో ఒక కారణం చూపి ఆధార్ తీయడానికి విముఖత చూపకపోవడంతో అనేక మంది గిరిజనులు వెనుతిరిగి వెళ్లారు. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు ఈ క్యాంపు లపై ప్రత్యేకంగా దృష్టి సారించకపోతే క్యాంపు ఏర్పాటు చేసి ఉపయోగం లేకుండా పోతుంది.

క్రైం న్యూస్

మహిళ మెడలో గొలుసు చోరీ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఒంటరిగా ఉన్న మహిళ మెడలో గొలుసును దుండగులు చోరీ చేసిన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులకు కథనం మేరకు తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయి నగర్ పంచాయితీ, ఎంకే నాయుడు కాలనీలో మంగమ్మ నివాసం ఉంటున్నారు. 9 సంవత్సరాల క్రితం భర్త చనిపోవడంతో సొంత ఇంటిలో ఒంటరిగా ఉంటుంది. బుధవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో తలుపులు గట్టిగా తట్టడంతో, తలుపులు తీసిన మంగమ్మ పైకి ఒక్కసారిగా చొరబడి, మెడలోని బంగారు గొలుసును లాక్కొని దుండగులు పారిపోయారు. పై అంతస్తులో ఉన్నవారు క్రిందికి వచ్చేలోపు నిందితులు తప్పించుకున్నారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు తిరుపతి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడికి కత్తిపోట్లు

చికిత్స పొందుతున్న దినేష్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఓ యువతి ప్రేమ వ్యవహారంలో ఇద్దరు నేను ప్రేమిస్తున్న యువతని నీవు ప్రేమిస్తావా అంటూ ఘర్షణకు దిగి కత్తితో దాడిచేసిన ఘటనలో ఓ యువకుడి కత్తి పోట్లుకు గురయ్యడు. తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని నేతాజీ నగర్‌కు చెందిన దినేష్, తిరుపతికి చెందిన కుహల్ ఒకే అమ్మాయిని ప్రేమించారు. ఈ విషయం గతంలో చిన్నపాటి గొడవలు జరిగాయి. ఈ నేపథ్యంలో గురువారం కుహల్ అతని స్నేహితులతో కలిసి మద్యం సేవించి, తిరుచానూరులోని దినేష్ ఇంటి వద్దకు వెళ్లి, బయటకు పిలిచారు. ఇంటి నుంచి బయట వచ్చిన దినేష్‌పై ఒక్కసారిగా కత్తితో దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో అక్కడ నుంచి పారిపోయారు. కత్తుపోట్లుకు గురైన దినేష్‌ను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న తిరుచానూరు పోలీసులు ఆసుపత్రి వద్దకు చేరుకొని, బాధితుని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కుహల్, గుణ, సునీల్, తేజ సాయి, మరో కొందరిపై హత్యా నేరం కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజనులపై దాడి

ప్రజాశక్తి - కేవిబి పురం: కేవీబి పురం మండలం, అంజూరు గిరిజన కాలనీలో యానాదులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సిపిఎం కేవీబి పురం మండల ప్రాంతీయ కార్యదర్శి నాగలాపురం నాగరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్‌లు డిమాండ్ చేశారు. రౌడీ మూకలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలన్నారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ గురువారం బోనుపల్లికి చెందిన రౌడీ మూకలు, అంజూరు గిరిజన కాలనీలోని యానాదులపై దాడి చేసి తీవ్రంగా కొట్టి గాయపరిచారన్నారు. ఈ ఘటనపై గిరిజనులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అంజూరు టీడీపీ నాయకుడు ముఖేష్ గిరిజనులకు మద్దతుగా నిలిచారు.

ఘనంగా ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవం

ప్రజాశక్తి - చంద్రగిరి : మోహన్ బాబు యూనివర్శిటీలోని ఎంబీ స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో గురువారం ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఔషధాల వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

అమర హాస్పిటల్లో..

ప్రజాశక్తి - రేణిగుంట: కరకంబాడి వద్దనున్న అమరా హాస్పిటల్‌లో గురువారం ఫార్మసీ డే ఘనంగా నిర్వహించచారు. ఈ కార్యక్రమానికి అమరా హాస్పిటల్ చైర్మన్ డా. ప్రసాద్ గౌరినేని, మేనేజింగ్ డైరెక్టర్ డా. రామాదేవి గౌరినేని ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసాద్ గౌరీనేని మాట్లాడుతు ఫార్మసిస్టులు, రోగుల ఆరోగ్యంలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ డా.రామాదేవి మాట్లాడుతూ అమరా హాస్పిటల్‌లో రోగుల భద్రతను, మందుల నాణ్యతను ప్రాధాన్యంగా చూసుకుంటామని తెలిపారు.

ప్రజల సహకారం మరువలేనిది

ప్రజాశక్తి - నాయుడుపేట: స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో ప్రజల సహకారం మరువలేనని స్వచ్ఛందంగా ప్రజలు ముందుకు వచ్చి, పార్కును శుభ్రపరచడంలో సహకరించినందుకు ఆనందంగా ఉందని నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ ఎస్.కె పజిలుల్లా పేర్కొన్నారు. ఏక్ దిన్ ఏక్ గంట ఏక్ సాత్ అనే థీమ్‌ను కొనసాగిస్తూ గురువారం సాయంత్రం నాయుడుపేట మున్సిపాలిటీలోని గాంధీ మున్సిపల్ పార్క్ ప్రాంతాలను శుభ్రపరచారు.ఈ కార్యక్రమంలో సానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నానో ఎరువులు విరివిగా వాడండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నానో యూరియా, డిఏపిఎన్‌ని విరివిగా వినియోగించాలని వ్యవసాయ ఉప సంచాలకులు లక్ష్మీదేవి రైతులకు సూచించారు. రాష్ట్రీయ సేవా సమితి (రాస్)పుత్తూరు కార్యాలయంలో కృషి విజ్ఞాన కేంద్రం ఏఆర్‌కేవీ, మద్రాస్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ వారి సంయుక్త ఆధ్వర్యంలో పుత్తూరు, నగిరి మండలాల రైతులకు వ్యవసాయం–ఆధునిక సాంకేతిక పద్ధతులపై గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎవో శ్రీ కోదండయ్య, మేనేజర్ రమేష్, అధికారులు రవి, మణి ప్రకాష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఐకెఎస్ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో మినిస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యలో భారతీయ జ్ఞాన పరంపర, డివిజన్ న్యూఢిల్లీ ద్వారా విశ్వవిద్యాలయంలో ఐ.కె.ఎస్ కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం కులాధిపతి నీడామంగళం గోపాలస్వామి, విశ్వవిద్యాలయ కులపతి ప్రొ.జి.ఎస్.ఆర్ కృష్ణమూర్తి, పద్మశ్రీ అవార్డు గ్రహీత శ్రీ మాడుగుల నాగఫణి శర్మ, ఐ.కె.ఎస్ డివిజన్, న్యూఢిల్లీ జాతీయ కోఆర్డినేటర్ గంటి సూర్యనారాయణ మూర్తి, అకాడమిక్ డీన్ ప్రొ.రజనీకాంత్ శుక్ల, రిజిస్ట్రార్ వెంకటనారాయణ రావులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ సంస్కృతంలో ఉన్న జ్ఞాన–విజ్ఞాన–వైజ్ఞానిక అంశాలను ఈ ఐ.కె.ఎస్ కేంద్రం ద్వారా బయటికి తీసుకొస్తూ, ప్రపంచ వ్యాప్తంగా అందరికీ సంస్కృత జ్ఞానాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ ప్రొ.రజనీకాంత్ శుక్ల, రిజిస్ట్రార్ వెంకట నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కందాటి శంకర్ రెడ్డి జయంతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కందాటి శంకర్ రెడ్డి జయంతి సందర్భంగా ఎయిర్ బైపాస్ రోడ్డు సమీపంలో గురువారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కందాటి సురేష్ రెడ్డి, కందాటి మిథున్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు జే డబ్ల్యు విజయ్ కుమార్, లలితమ్మ మాజీ నగర టిడిపి పార్టీ లీడర్స్ పాల్గొన్నారు.

పోలేరమ్మ నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం భక్తులకు శ్రీ శ్రీ కాత్యాయని అమ్మ వారి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు మాట్లాడుతూ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు.

IN THE COURT OF THE V ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) OF CHITTOOR
O.S.NO.1127 of 2022

Between
Bezawada Sudhakar ... Plaintiff.
And
Venkitila Indu Sekhar ... Defendant.

SUIT SUMMONS TO THE DEFENDANT

To
Venkitila Indu Sekhar, S/o V.Chinnabba Naidu, residing at Plot.No.19, Indian Bank Buildings, 4th floor, Jai Nagar Colony, Bairagipatida, Tirupati Town and Mandal and District.

Whereas the above named plaintiff has filed the above suit for recovery of money on the file of above named Court against you and the same is pending before the above named Court for your appearance on **05-11-2025.** This is to inform you if you have got any objection you may appear before the above named Court at **10-30A.M., on 05-11-2025** either in person or through an advocate and file your objections. If you fail do so, the matter will be decided expartee.

Sd/- **Sri. K.SURESH,** B.A., B.L., Advocate,
10-115,Gandhi Road Ext.,CHITTOOR.

ఇంట్లో చోరీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన సంఘటన పట్టణంలోని వినాయకనగర్ బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. రామచంద్రారెడ్డి, గౌరీ దంపతులు కంటి చికిత్స కోసం తిరుపతికి వెళ్లారు. చికిత్స అనంతరం గురువారం సాయంత్రం ఇంటికి రాగా తాళాలు పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగిందని గ్రహించారు. బీరువాలోని 24 గ్రాముల బంగారు, రూ.10 వేల నగదు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్వాడీ కేంద్రాలలో పరిశుభ్రత- పచ్చదనం

ప్రజాశక్తి - రామచంద్రపురం : ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాల సందర్భంగా స్వచ్ఛతే హీ సేవా కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం రామచంద్రపురం ఎస్సీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో సెక్టార్ సూపర్వైజర్ మణిలా ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు, మహిళలు పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాలు రాజేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, మహిళలు పాల్గొన్నారు.

స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి ఏరియా ఆసుపత్రిలో గరువారం స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మెడికల్ క్యాంపుకు ముఖ్య అతిధిగా పులివర్తి సుధా రెడ్డి హాజరయ్యారు. గర్భవతులకు పౌష్టిక ఆహారం పులివర్తి సుధారెడ్డి పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం నాయకులు గౌస్ బాషా, సక్కురు ధనంజయ రెడ్డి, కార్యకర్తలు, మహిళలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌కమ్ ట్యాక్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పన్నులను సకాలంలో చెల్లించాలని ఆదాయపు పన్ను అధికారి ఆశిష్ కుమార్ పేర్కొన్నారు. గురువారం గూడూరులో ఇంకమ్ టాక్స్ అవగాహన కార్యక్రమం హోటల్ మహేంద్ర ఎలైట్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆదాయపు పన్ను అధికారి ఆషిష్ కుమార్, ఆదాయపు పన్ను ఇన్స్పెక్టర్ జి. నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాన్-ఆధార్ లింకింగ్, ఆఈటీఆర్‌లు సమయానికి దాఖలు చేయడం, ఆలస్యంగా రిటర్న్లు దాఖలు చేయడంవల్ల కలిగే ప్రభావాలు, పాత పన్ను విధానం, కొత్త పన్ను విధానాల ఫీచర్లు, రిటర్న్ ఈ-వెరిఫికేషన్, ఏ. ఐ.ఎస్ పోర్టల్ వినియోగం, తప్పుడు రీఫండ్ క్లైయిమ్‌ల పరిణామాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్లు శ్రీకంటి రామ్మోహన్ రావు, పూర్ణచంద్రరావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :గూడూరు మండల పరిధి, కాంద్ర గ్రామం, పంచాయతీ కార్యాలయంలో 8 వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సి.డి.పి.వో మెహబూబి మాట్లాడుతూ పోషకాహారం, స్థానిక ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ స్వరూప రాణి, అరుణ కుమారితదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు

ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ:మండలంలోని ఈ బీసీ కాలనీలో ఘనంగా పోలేరమ్మ గంగ జాతర బుద్ధవారంతో నాలుగో రోజు. జాతరలో భాగంగా పోలేరమ్మ విగ్ర హానికి విశేషాలంకరణ చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయంలోని సుబ్ర మణ్యంస్వామి, వినాయకస్వామి విగ్రహాలను, నవగ్రహాలను పిండి విగ్రహాలను చేసి పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ పోలేరమ్మ మాతను గ్రామంలో ఊరేగించారు. గ్రామ స్తులు భారీసంఖ్యలో ఎదురు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసా దాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రయ్య శివమణి శేఖర్ వర్ధన్ సునీలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ శక్తి పీఠంలో శ్రీ భువనేశ్వరి దేవిగా భక్తులకు దర్శనం

ప్రజాశక్తి - రామచంద్రపురం : మండలంలోని, రాయలచెరువు లో వెలసియున్న శ్రీ శక్తిపీఠం నందు కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి, శ్రీ శక్తి పీఠాదీశ్వరి మాతాజీ రమ్యానందభారతీ మహా స్వామినీ ల ఆధ్వర్యంలో నాల్గవ రోజు దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం శ్రీ మరకత శక్తి కాళీ దేవికి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించి, అనంతరం పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు పుష్పాలతో శ్రీ భువనేశ్వరీ దేవి రూపంలో అలంకరించారు. అనంతరం మంగళ వాయిద్యములు, కోలాట నృత్య ప్రదర్శనలు, ఓం శక్తి నామస్మరణల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఘోర పాప నాశన మహా ప్రత్యంగిరా హెూమము నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు శ్రీ మరకత శక్తి కాళీదేవికి శ్రీ శక్తి పీఠాదీశ్వరి మాతాజీ రమ్యానందభారతీ మహా స్వామినీ దర్బారు సేవ నిర్వహించారు. దేశ విదేశాల నుండి 5,000 మంది భక్తులు శ్రీ భువనేశ్వరి దేవిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు శ్రీ శక్తి పీఠం నిర్వాహకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి - చంద్రగిరి:చంద్రగిరి గ్రామ దేవతగా భక్తుల కోర్కెలను కొంగు బంగారం చేస్తున్న మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకంగా పూజలు నిర్వహిస్తున్నారు. అమ్మవారి ఆలయంలో మధ్యాహ్నం అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని వాహన మండపనికి తీసుకొని వచ్చారు. వాహన మండపంలో అమ్మవారికి పాలు పెరుగు తేనె నెయ్యి ఇతర సుగంధ పరిమళ ద్రవ్యాలతో పాటు పసుపు కుంకుమ గంధం లతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం అభిషేక కార్యక్రమాన్ని వేదమంత్రాలతో చేపట్టారు. పరిశుద్ధ జలాలతో అమ్మవారికి అభిషేకం అనంతరం అమ్మవారిని పట్టు పీతంబరాలు ధరింపజేసి బంగారు ఆభరణాలు ధరించి విశేష అలంకరణ చేశారు. విశేషంగా అలంకరణ మూలస్థాన ఎల్లమ్మ అమ్మవారు నూతనంగా ఇటీవల భక్తులు విరాళం ఇచ్చిన వెండి పూత గజ వాహనంపై కొలువై భక్తులకు దర్శన భాగ్యం ఇచ్చారు. చంద్రగిరి పుర వీధుల్లో ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, కమిటీ సభ్యులు కూటమి నాయకులు భక్తులు అధికారులు స్థానికులు పాల్గొన్నారు.

నిషా ముక్త్ భారత్ అభియాన్

ప్రజాశక్తి - చంద్రగిరి:చంద్రగిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నిషా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ భక్తవత్సలం, సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్‌లు మాట్లాడుతూ మత్తు పదార్థాలు వాడితే చట్ట ప్రకారం ఏ తరహా శిక్షలకు గురి అవుతారో విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మురళి, డాక్టర్ రమణయ్య, సైకాలజిస్ట్ రుయా హాస్పిటల్ విభాగాధిపతులు డాక్టర్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వీణాపాణి..
కోరిన కోర్కెలు
తీరన్న..
కొండల
రాయుడుకి
నీరాజనం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :ప్రజలు తమ ఇంటిని మాత్రమే కాక, పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకుంటే అనారోగ్య సమస్యలు రావని విష జ్వరాలు రాకుండా మంచి నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు సూచించారు. గూడూరు టిడ్కో అపార్ట్మెంట్‌ల వద్ద స్వచ్ఛత హీ కార్యక్రమంలో భాగంగా పార్కులను కమిషనర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

వొకేషనల్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న విద్యార్థులకు హెల్త్ కేర్ వొకేషనల్ కోర్స్‌లో భాగంగా సమగ్ర శిక్ష ఆదేశాలు మేరకు దసరా సెలవుల్లో పదవ తరగతి, ఇంటర్మీడ్ రెండవ సంవత్సరం చదువుకున్న విద్యార్థులకు గురువారం ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహించారు. ఈశిక్షణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణయ్య ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సెంట్రల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు మురళీధర్ రెడ్డి, ఉదయ్ కుమార్, హెల్త్ కేర్ ట్రైనర్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధుల కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం, వెలుగు కార్యాలయంలో ఏపియం, సీసీలు, విఓ ఏలు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళా సంఘాలు సభ్యులు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సభ్యులు తీసుకున్న బ్యాంకు రుణాలు, స్త్రీ నిధి వంటి వాటిపై చర్చించారు. ఏపియం మునెయ్య మాట్లాడుతూ పశువులు కొనుగోలుకు ఆసక్తి కలిగిన వారితో ఈ నెల 15 నుండి 24వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో వెటర్నరీ డాక్టర్లతో కలసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఇంకా పెండింగ్ ఉన్న వార్షిక ఋణ ప్రణాళిక, సభ్యులు ముఖ నమోదు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో సిసిలు వెంకటరత్నం, వీరజిన్నప్ప, పయని, జీవ, విఓఏలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మహిళలకు పౌష్టిక ఆహారంతో ఆరోగ్యకరమైన జీవనశైలి సాధ్యమని ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీదేవి తెలిపారు. పట్టణంలోని, రజక కాలనీ మహిళలకు టాటా ట్రస్ట్ సంతోషి, అంగన్వాడీ కార్యకర్తలు ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కల్పించారు.